క్లుప్తంగా

నేడు తూడిలో గడపగడపకు..'

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఉద్యోగుల నిరసన



రిలేదీక్షలు చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు

కురుపాం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కె.నాగేంద్రసాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కాపు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ముమ్మరంగా రబీ వరికోతలు



కాట్రగడ సమీపంలోని పొలాల్లో కోతయంత్రాలు

భామిని: మండలంలో రబీ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి పొలాల్లో కోత యంత్రాలు హడావిడిగా తిరుగుతూ కనిపిస్తున్నాయి. మండలంలోని బత్తిలి, గురండి, బొమ్మిక, పక్కుడుబద్ర, కాట్రగడ గ్రామాల్లో బుధవారం వరికోతలు చేపట్టారు. ట్రాక్టర్లతో ధాన్యం బస్తాలను ఇళ్లకు చేరవేస్నారు. మరో వైపు ఈదురుగాలులు, వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు



జియ్యమ్మవలస: బీజేపురంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జియ్యమ్మవలస: ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులకు మాత్రమే మస్తర్లు వేయాలని, పనికి హాజరుకాని వారికి మస్తరు నమోదు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రమేష్ హెచ్చరించారు. బీజేపురం గ్రామంలో కూనేరు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాల్లో ఉండాలని, పారదర్శకంగా కొలతలు వేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● భామిని: ఉపాధిహామీ పనులకు సంబంధించి తప్పుడు మస్తర్లు నమోదు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల వద్ద ఊర చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం పరిశీలించారు. వేసవి ఎండల నేపథ్యంలో పని ప్రదేశం వద్ద తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

భూముల రీసర్వేకు సహకరించండి

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధిలో భూముల రీసర్వేకు స్థానిక రైతులు, భూయజమానులు సహకరించాలని తహసిల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న ఉదయం 10 గంటలకు స్థానిక పెద్దకాపువీధి షిర్డీసాయి మందిరం వద్ద ప్రజా ప్రతినిధుల సమక్షంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశం ద్వారా రీసర్వేపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయటంతో పాటు సర్వే చేయు సమయాలను వెల్లడిస్తామన్నారు. ఆ సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన ధ్రువపత్రాలు, పట్టదారు పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, 2 పాస్‌ఫోటోలు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు.

ఆర్బీకేకి చేరిన విత్తనాలు

బలిజిపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వంతరాం ఆర్బీకేకి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని ఏఓ శ్రావణ్ తెలిపారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు మూడు రోజుల్లో విత్తనాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. రైతులు ముందస్తుగా డి-క్రిషి ద్వారా ఆర్బీకేలలో బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆతరువాత రైతు కట్టాల్సిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు. అందులో భాగంగా వంతరాం ఆర్బీకేకి 1121రకం 114క్వింటాళ్లు, స్వర్ణ 3క్వింటాళ్లు, 1064రకం 3క్వింటాళ్లు విత్తనాలు వచ్చినట్లు చెప్పారు.

పేదల సంక్షేమమే జగనన్న ఆశయం

● ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
● పెద్దూరులో 'గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు పుష్పగుచ్ఛాలు, హారతులతో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటికీ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో ప్రతీ కుటుంబానికి రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే పథకాలు అందించేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ ఆశీస్సులు అందించాలని కోరారు. ఎంపీపీ ఉరిటి రామారావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఎంపీటీసీ డి.నారాయణమ్మ, ఉపసర్పంచ్ టి.ఎల్లంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాదలింగి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని పాలేం, మాదలింగి సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, వారి పనితీరు, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. పౌరసేవలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాదలింగి పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాదలింగి సర్పంచ్ తుమరాడ కళావతి, పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు 150 రోజులు ఉపాధి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



రహదారి పనులు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న లబ్ధిదారులకు 150 రోజులు ఉపాధి పనులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. వేతనదారులకు ఒక్కొక్కరికి రూ.272 వేతనం అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో కొంతమంది జాబ్‌కార్డులు డిలీట్ అయ్యాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

మత్రిపాడు-రేగులగూడ, ద్వారబందం వరకు రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పీఓ అన్నారు. రోడ్డు పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఫారెస్టు అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ ప్రసూన, పీఆర్ ఈఈ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి



చెరువు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న ఉపాధి పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామ సమీపంలో ఉన్న గుడివాడ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. సగటు వేతనం, మస్తర్లు నమోదు, వేతనదారుల హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

వర్షంతో ఉపశమనం



సీతంపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం

సీతంపేట, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం: పాలకొండ, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో ఊరట లభించింది. ఈ వర్షంతో జీడి, మామిడి పంటలకు నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. పాలకొండ పట్టణంలో వడగళ్ల వర్షం కురిసింది. వర్షంనీరు రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందిపడ్డారు.



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం



పాలకొండలో కురుస్తున్న వర్షం

శిశువుకు ఎన్ఎన్‌సీయూలో చికిత్స



శిశువును డిశ్చార్జ్ చేస్తున్న వైద్యులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు నవజాత శిశువు ప్రాణాలు కాపాడారు. భామిని మండలం బూర్జగూడకు చెందిన ఆరిక సునీత పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గత నెల 18న ఆస్పత్రిలో చేర్పించారు. నెలలు నిండకముందే శిశువుకు జన్మనివ్వడంతో పుట్టిన బిడ్డ 1.7 కిలోల బరువు ఉంది. అపస్మారక స్థితిలో ఉన్న శిశువును ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ యూనిట్‌లో ఉంచి చికిత్స అందించారు. కంగారు థెరపీ, ఫోటోథెరపీ వంటి సేవలందించారు. అలాగే తల్లీబిడ్డకు 35 రోజుల పాటు సరైన పోషకాహారం అందజేయడంతో బిడ్డ బరువు 2 కిలోలకు చేరుకుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో బుధవారం వారికి డిశ్చార్జ్ ఇచ్చామన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



వేసవి విజ్ఞాన తరగతులను పరిశీలిస్తున్న శంకరరావు

పాలకొండ రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.జనార్దనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు భారతదేశ చరిత్ర, పోటీ పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు జి.మురళి, బి.రవిప్రసాద్ విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ గణేష్‌బాబు, ఈశ్వరరావు తదితరులున్నారు.

– భామిని: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి వీజేఎస్ శంకరరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను గ్రంథాలయ అధికారి ఎ.సునీతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భందగా భామిని సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు బి.ప్రమోద్ కుమార్ విద్యార్థులకు జనరల్‌నాలెడ్జ్ తరగతులు బోధించారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

పాలకొండ: మండలంలోని కొండాపురంలో అన్నవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ కమల్‌నాథ్ గ్రామంలోని 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 8 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స అందించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు వెంటతీసుకుని వెళ్లాలని సూచించారు.

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తిచేయాలి

● డీఈఓ ప్రేమ్‌కుమార్



జేవీకే కిట్లు పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సీతంపేట: పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. మండలానికి ఎన్ని కిట్లు వచ్చాయి, పుస్తకాలు ఎన్ని వచ్చాయి తదితర వివరాలను ఎంఈఓ ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాశాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి 'నాడు-నేడు' పనులన్నీ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలికవసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులందరికీ జేవీకే కిట్లు అందేలా చూడాలన్నారు.

విద్యాకానుక కిట్లు పరిశీలన



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

కురుపాం: మండల కేంద్రంలోని జగనన్న విద్యాకానుక స్టాక్‌పాయింట్‌ను పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. మండలంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎన్ని పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అవసరం, ప్రస్తుతం ఎన్ని వచ్చాయి తదితర వివరాలను ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొండెంఖల్ గ్రామ సచివాలయాన్ని సందర్శించి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అమలును పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత అవసరం



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకుడు చిన్నసుబ్బారావు

పాలకొండ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టభద్రత అవసరమని ఉత్తరాంధ్రా జిల్లాల ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుడు ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు అన్నారు. పాలకొండ పట్టణంలోని కస్పావీధిలో బుధవారం ఎంఆర్‌పీఎస్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ శ్రీకాకుళం రానున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న 'గో టూ విలేజెస్ టూ ఫీల్డ్ డేస్' కార్యక్రమానికి సంబంధించిన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల సభ్యులు, మేధావులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ లోపింటి కృష్ణ, తేజా, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుడు గుంట మోహనరావు, బోగి జేమ్స్, సారిక రమేష్, సుధా, పకీరునాయుడు, నత్తల కృష్ణ, అలజంగి చిన్నారావు, ఎస్.భాస్కరావు, యందవ మరియదాసు తదితరులున్నారు.

వలంటీర్లకు సత్కారం



సత్కారాలు పొందిన వలంటీర్లతో ప్రజా ప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: జగనన్న ప్రభుత్వానికి వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ రెండు కళ్లు అని వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని అంపిలి గ్రామంలో సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు అధ్యక్షతన అన్నవరం, గోపాలపురం సచివాలయాల పరధిలో సేవలందిస్తున్న వలంటీర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, జగనన్న పాలనలో అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర రాజశేఖర్, పట్టణ పీఏసీఎస్ అధ్యక్షుడు లోలుగు నారాయణరావు, మాజీ సర్పంచ్ గవర ప్రసదరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింత సంగంనాయుడు, పలుశాఖల అధికారులు ఉన్నారు.

మట్టి తవ్వకాలపై విచారణ



చెరువులో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న గనులశాఖ అధికారి హరిబాబు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలను గనులు, భూగర్భ శాఖ అధికారి డి.హరిబాబు బుధవారం పరిశీలించారు. ఈ మేరకు ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పోలూరి శ్రీనివాసరావు మంగళవారం ఈ చెరువులో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయంటూ 'జగనన్నకు చెబుదాం' ఫోన్ నంబర్ 1902కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా గనులు, భూగర్భ శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారి హరిబాబు చెరువును పరిశీలించారు. చెరువులో తవ్విన మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారు, అనుమతులు ఉన్నదీ లేనిదీ తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్‌కు సిద్ధమవుతున్న సిబ్బంది

కొమరాడ: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 31 పంచాయతీల్లో చేపట్టిన 1941 పనులకుగాను 16వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ఆడిట్ సిబ్బంది వచ్చారని ఏపీఓ బాలకృష్ణ తెలిపారు. గ్రామల్లో జరిగిన అభివృద్ధి పనులు, వేతనదారులు కల్పించిన పనులు, వారికి చెల్లించిన బిల్లులు, నిధుల ఖర్చుల వివరాలను సేకరిస్తారన్నారు. సుమారు రూ.263.02 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తారని చెప్పారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

● ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత



వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామ వలంటీర్లు

కురుపాం: గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వీవీ శివరామప్ప ఆధ్వర్యంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం, కిచ్చాడ, బియ్యాలవలస, కిచ్చాడ, రస్తాకుంటుబాయి పంచాయతీలకు చెందిన 75 మంది గ్రామ వలంటీర్లను సత్కరించారు. గ్రామ వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలను సకాలంలో చేరవేసే సంక్షేమ సారథులని కొనియాడారు. వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పురస్కారాలు పొందిన గ్రామ వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం తమకు పురస్కారాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి నాగేశ్వరావు, సర్పంచ్‌లు హిమరిక నాగేశ్వరరావు, అద్దాకుల మన్మథరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జిలాని, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com